క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో గ్యార్వీ షరీఫ్



గ్యార్వీ షరీఫ్‌లో పాల్గొన్న ముస్లిం మత పెద్దలు, యువకులు

కోటవురట్ల: స్థానిక ముస్లిం కాలనీలో గ్యార్వీ షరీఫ్‌ను సోమవారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మజీద్ ఉస్మాన్ ఘని, నవ జవాన్ యూత్ ఆధ్వర్యంలో మదర్సా పిల్లలు ఖురాన్ పఠనం చేశారు. గౌస్ పాక్ చందన ఊరేగింపు జరిగింది. సాయంత్రం దీపాలు వెలిగించి పూజలు చేశారు. సర్కార్ గౌస్ పాక్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం విందు భోజనం ఏర్పాటు చేశారు. స్థానిక పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చేతుల పరిశుభ్రతపై అవగాహన

ఎస్.రాయవరం: ప్రతి ఒక్కరూ ఆహారం తీసుకునే ముందు విధిగా చేతులు శుభ్రం చేసుకోవాలని సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్యాధికారి శక్తిప్రియ సూచించారు. ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా మంగళవారం పలు పాఠశాలల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సర్వసిద్ధి, పేటసూదిపురం గ్రామాల్లో ఆమె పర్యటించి చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేత్రదానంతో మరొకరికి చూపు

నేత్రదానం చేసి మరొకరికి చూపును ప్రసాదించాలని సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్యాధికారి శక్తిప్రియ అన్నారు. ప్రపంచ అంధుల ఆసరా దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పేటసూదిపురం గ్రామంలో పలువురికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. కంటి వైద్య నిపుణుడు వెంకటరావు పలువురికి వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు.

సాంబశివుని సన్నిధిలో భజన



మునగపాక సాంబశివుని ఆలయంలో భజన చేస్తున్న కళాకారులు

మునగపాక: మునగపాక సాంబశివుని ఆలయంలో మంగళవారం ప్రత్యేక భజన కార్యక్రమం నిర్వహించారు. గురుస్వామి మాడెం జోగారావు పలు గీతాలు ఆలపించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు పరమేశ్వరున్ని దర్శించుకుని పూజలు చేశారు.

గ్రామంలో తుప్పల తొలగింపు



పొక్లెయిన్‌తో తుప్పలను తొలగిస్తున్న దృశ్యం

పాయకరావుపేట: మండలంలోని కుమారపురంలో సర్పంచ్ పెరుమాళ్ళ గోవిందమ్మ సొంత నిధులతో తుప్పల తొలగింపు పనులు చేపట్టారు. గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా పెరిగిన ముళ్ల తుప్పలను పొక్లెయిన్‌తో తొలగించి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో సమరసతా సేవా ఫౌండేషన్ ప్రతినిధి నీలాపు వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి పెట్టండి



మాట్లాడుతున్న డీఎల్‌డీవో ఉదయశ్రీ

నక్కపల్లి: గ్రామాల్లో పారిశుధ్యం, క్లోరినేషన్ ప్రక్రియలపై దృష్టిసారించాలని డీఎల్‌డీవో ఉదయశ్రీ సూచించారు. మంగళవారం నక్కపల్లి ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వర్షాలు పడడంతో గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. తక్షణమే కార్యదర్శులంతా గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలన్నారు. పేరుకుపోయిన చెత్తను తొలగించాలని, కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టాలన్నారు. గొట్టపు బావులు, బావులు, రక్షిత మంచినీటి పథకాల్లో క్లోరినేషన్ చేపట్టాలన్నారు. వీధులు, కాలువల్లో బ్లీచింగ్, ఫినాయిల్ చల్లించాలన్నారు. అంటురోగాలు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీతారామరాజు, ఈవోపీఆర్‌డీ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సామాన్యుడిపై ధరాఘాతం

- ఆకాశాన్నంటుతున్న కూరగాయల ధరలు
- ఏది చూసినా రూ.60కు పైనే
- టమాటా, ఉల్లిదీ అదే పరిస్థితి



కొనుగోలుదారులు లేక దిగాలుగా ఉన్న విక్రయదారు పరదేశమ్మ



మునగపాకలోని మార్కెట్

మునగపాక: ఏం కొనేటట్టు లేదు.. ఏం తినేటట్టు లేదు.. నాగులో నాగన్న అన్న పాట ప్రస్తుతం అక్షరాల నిజం. మార్కెట్‌లో కూరగాయల ధరలను చూసి జనం బెంబేలెత్తుతున్నారు. ఏ కూరగాయ కొందామన్నా కిలో రూ.60కు తక్కువ లేదు. పెరిగిన ధరలతో కూరగాయలు ఎలా కొనాలంటూ సామాన్య ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో కూరగాయల ధరల ప్రకారం ప్రతి ఇంటికి అదనంగా రూ.1500 వరకు భారం పడుతోంది. దీనికి తోడు కార్తీక మాసం సమీపిస్తున్న తరుణంలో ధరలు మరింత పెరిగిపోయే అవకాశం ఉందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి ధరలను అదుపు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రైతుబజార్ల ఏర్పాటు అవశ్యం

మార్కెట్‌లో కూరగాయల ధరలు పెరిగిపోతున్న నేపథ్యంలో ప్రభుత్వం రైతుబజార్లను స్థానికంగా అందుబాటులోకి తీసుకురావడం ఎంతైనా అవసరం. కనీసం మండల ప్రధాన కార్యాలయంలో రైతు బజారు ఏర్పాటు చేస్తే సామాన్యుడికి అందుబాటులో ధరలు ఉంటాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఒక వైపు నిత్యావసర సరకుల ధరలు పెరిగిపోవడం.. మరోవైపు కూరగాయల ధరలు కూడా ఆకాశాన్నంటడంతో సామాన్య ప్రజల కోసం ప్రభుత్వం రైతుబజార్లను ఏర్పాటు చేసి ధరలను అదుపులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

ధరలను నియంత్రించాలి



కొంత కాలంగా కూరగాయల ధరలు పెరిగిపోతున్నాయి. నిత్యావసర సరకుల తీరు అదే విధంగా ఉంది. దీంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ధరలను నియంత్రించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. రైతుబజార్లు అందుబాటులోకి తీసుకువచ్చి కూరగాయలు ధరలు తగ్గేలా చూడాలి.

– శీరా రమణమ్మ, గృహిణి, గొల్లలపాలెం

రైతుబజార్లను ఏర్పాటు చేయాలి



మార్కెట్‌లో పెరిగిపోతున్న ధరలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నియంత్రించాల్సి ఉంది. ధరలను అదుపు చేయకపోవడంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ధరలను నియంత్రిస్తామంటూ ఇచ్చిన హామీలను ప్రభుత్వాలు గాలికి వదిలేశాయి. రైతుబజార్లను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ధరలను నియంత్రించవచ్చు.

– రాజాన బుజ్జి, సామాజిక సేవా కార్యకర్త, మునగపాక

ధరలపై వినతులు అందాయి..

కూరగాయల ధరలు తగ్గేలా చూడాలని పలువురి నుంచి వినతులు అందాయి. వర్షాల కారణంగా పంటలు దెబ్బతినడంతో కూరగాయల ధరలకు రెక్కలొచ్చాయి. ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్తాం. రైతుబజార్ల ఏర్పాటు చేయడం ద్వారా కూరగాయల ధరలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది.

– ఆది మహేశ్వరరావు, తహసీల్దార్, మునగపాక

ఈ ఏడాది జూన్‌తో పోల్చితే అక్టోబర్‌లో కూరగాయల ధరల్లో వ్యత్యాసాలు ఇలా..

కూరగాయలు (కిలో ధర రూ.ల్లో)	జూన్	అక్టోబర్
ఉల్లి	48	65
టమాటా	60	80
పచ్చిమిర్చి	45	65
క్యారెట్	40	55
బీరకాయ	38	50
క్యాప్సికమ్	40	60
బీట్‌రూట్	35	45
బంగాళాదుంప	30	40
చిక్కుడుకాయ	55	80
ములక్కాడ	55	80
దొండకాయ	30	45
బెండకాయ	30	40
వంకాయలు	45	55
ఆగాకరకాయ	45	80

రైతుల జాబితాపై నేడు సోషల్ ఆడిట్

మునగపాక: మునగపాక సచివాలయం వద్ద బుధవారం ఉదయం 10 గంటలకు ఖరీఫ్ పంట నమోదు చేసుకున్న రైతుల జాబితాపై సోషల్ ఆడిట్ జరుగుతుందని వీఏఏ సింధూజ ఒక ప్రకటనలో తెలిపారు. 2024 ఖరీఫ్‌కు సంబంధించి నిర్వహించే సోషల్ ఆడిట్‌లో మార్పులు, చేర్పులు ఉంటే రాత పూర్వకంగా తెలియజేయాలని సూచించరాడు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

రాంబిల్లి తహసీల్దార్ కార్యాలయం సందర్శన



తహసీల్దారు, సీఐతో మాట్లాడుతున్న అనకాపల్లి ఆర్డీవో ఆయిషా

రాంబిల్లి(యలమంచిలి): రాంబిల్లి మండలం తహసీల్దార్ కార్యాలయంను అనకాపల్లి ఆర్డీవో ఆయిషా మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాసరావు, రాంబిల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.నర్సింగరావుతో సమావేశమయ్యారు. మండలంలో నేవీ ప్రహరీ నిర్వాసితుల సమస్యలు, నేవల్ బేస్ ప్రాజెక్ట్ నిర్వాసితుల సమస్యలపై వారితో చర్చించారు. తుపాను ప్రభావిత ప్రాంతాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్థానిక కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, వీఆర్వోలు, వీఆర్ఏలు, తదితరులు పాల్గొన్నారు.

ఏపీజే అబ్దుల్ కలాంకు ఘన నివాళి



పాములవాక జెడ్పీ హైస్కూల్‌లో అబ్దుల్ కలాం చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



నక్కపల్లి మండల పరిషత్ కార్యాలయంలో కలాం చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

కోటవురట్ల: దివంగత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాములవాక కిల్లాడ రామ్మూర్తి నాయుడు జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం కె.వి.లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చిట్టియ్య, రాము, సోమేష్, వరప్రసాద్, దేవుడు, సుజాత, రామలక్ష్మి, పీడీ అచ్యుతరావు పాల్గొన్నారు.

నక్కపల్లి: మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ జయంతిని మంగళవారం నక్కపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో సీతారామరాజు, తహసీల్దార్ నర్సింహమూర్తి తదితరులు కలామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీవో ఉదయశ్రీ, ఈవోపీఆర్‌డీ సత్యనారాయణ, వివిధ శాఖల సిబ్బంది, కార్యదర్శులు, వీఆర్వోలు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి గ్రామ సభలు

యలమంచిలి రూరల్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో భూముల రీసర్వే పూర్తయిన యలమంచిలి మండలంలోని పలు గ్రామాల్లో ఈ నెల 17 నుంచి గ్రామ సభలు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ వరహాలు తెలిపారు. 17న జంపపాలెం, 18న గొల్లగుంట, సోమలింగపాలెం, 19న పులపర్తి, 22న తెరువుపల్లి, 23న పీఎస్ఆర్ పేట, 24న కృష్ణాపురం, 25న ఏటికొప్పాక గ్రామ సభ నిర్వహించనున్నట్టు ఆయన పేర్కొన్నారు. భూముల రీసర్వే జరిగిన గ్రామాల్లో రైతుల నుంచి వచ్చే వినతులు, ఫిర్యాదులు పరిశీలించి క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించినట్టు ఆయన తెలిపారు.

మునగపాక: రీ–సర్వే పూర్తయిన గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సులు విజయవంతమయ్యేలా చూడాలని తహసీల్దార్ ఆది మహేశ్వరరావు కోరారు. మంగళవారం రెవెన్యూ కార్యాలయంలో అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ నెల 17న మడకపాలెం, 18న అరబుపాలెం, 19న మునగపాక, 21న గంటవానిపాలెం, 22న పురుషోత్తపురం, 23న వాడ్రాపల్లి, 24న తోటాడ, 25న పాటిపల్లి, 26న ఒంపోలు, 28న ఉమ్మలాడ, 29న రామభద్రపురం, 30న వెంకటాపురం, నవంబర్ 1న చూచుకొండ, 2న పల్లపు ఆనందపురం, 4న నాగులాపల్లి, 5న కాకరాపల్లి, 6న జేపీ అగ్రహారం, 7న రాజుపేట, 8న మల్లవరం, 11న గణపర్తి, 12న తిమ్మరాజుపేట, 13న చల్లమల, 15న కుమారపురం గ్రామాల్లో సదస్సులు జరుగుతాయన్నారు.

అభ్యసన వైకల్యాలను గుర్తించి బోధన



గొడిచర్లలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



పీహెచ్ వాడలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

నక్కపల్లి: దివ్యాంగుల్లో అభ్యసన వైకల్యాలను గుర్తించి బోధన చేయడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని ఎంఈవో–2 వేమగిరి నూకరాజు, ప్రత్యేక విద్యా బోధన ఉపాధ్యాయిని యాస్మిన్ అన్నారు. మంగళవారం గొడిచర్ల, డొంకాడ గ్రామాల్లో గొడిచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో డిస్లెక్సియార్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులకు అభ్యసన వైకల్యాలను ఎలా అధిగమించాలో వివరించారు. సహిత విద్యతోనే అందరికి విద్య సాధ్యమవుతుందన్నారు.

పాయకరావుపేట: డిస్లెక్సియాపై పీహెచ్ వాడ ఎంపీపీ పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అభ్యసన వైకల్యం ఉన్న పిల్లలకు సహిత విద్యా బోధన ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చునన్నారు. ఈ నెల 18వ తేదీ వరకు డిస్లెక్సియా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఎంఈవో రమేష్‌బాబు తెలిపారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పాలన



వాడ్రాపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక: ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే విజయకుమార్ అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, మాజీ ఎంపీపీ మంజు, కూటమి నేతలు దొడ్డి శ్రీను, టెక్కలి పరశురామ్, మళ్ల వరహా నరసింగరావు, కొయిలాడ దశావతారం, ఎంపీడీవో ఉషారాణి పాల్గొన్నారు.

పాయకరావుపేట: మండలంలోని పెదరాంభద్రపురం, ఎస్.నర్సాపురం, కొత్తూరు గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమాలు నిర్వహించినట్టు ఎంపీడీవో జయప్రకాష్‌రావు తెలిపారు. పెదరాంభద్రపురంలో రూ.7 లక్షలు, ఎస్.నర్సాపురంలో రూ.13 లక్షలు, కొత్తూరులో రూ.5 లక్షలతో రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశామన్నారు.

రాంబిల్లి(యలమంచిలి): రాంబిల్లి మండలం కొత్తపట్నం గ్రామంలో మంగళవారం పల్లె పండగ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎంపీడీవో జయమాధురి భూమి పూజ చేశారు.

మూలపేటలో సమస్యల పరిష్కారానికి కృషి

మునగపాక: మూలపేటలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు అన్నారు. మూలపేటలో రక్షిత మంచినీటి పథకానికి సంబంధించిన మోటార్ కాలిపోవడంతో మంగళవారం కొత్త మోటార్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూలపేటలో సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మానస, పంచాయతీ కార్యదర్శి గంగాధర్, వార్డు సభ్యులు కాండ్రేగుల నాని, యలప్ప హైమావతి నాయుడు, నారాయణమూర్తి పాల్గొన్నారు.

ఎరువుల వాడకంపై అవగాహన అవసరం



రైతులకు క్షేత్ర స్థాయిలో సూచనలు చేస్తున్న నక్కపల్లి మండల ఏవో ఉమాప్రసాద్, తదితరులు



ములకలాపల్లిలో ఎరువులు, పురుగు మందుల మోతాదుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

నక్కపల్లి: వరి పంటలో ఎరువుల వాడకం, పురుగు మందుల మోతాదు, పిచికారీ విషయంలో రైతులకు అవగాహన ఉండాలని మండల వ్యవసాయాధికారి ఉమాప్రసాద్ అన్నారు. మంగళవారం నక్కపల్లి పరిసర గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీడపీడలు పెరుగుతున్న తరుణంలో సమగ్ర సస్యరక్షణ చర్యలే కీలకమన్నారు. బీసీటీ కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ వరి పంటలో చిరు పొట్టదశలో ఎకరాకు 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ చల్లడం ద్వారా గింజ నాణ్యతను, బరువును పెంచవచ్చన్నారు. సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ శైలజ, విజయరాణి మాట్లాడుతూ బీసీటీ ద్వారా చేపడుతున్న రైతు సేవా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా వనరుల కేంద్రం అధికారి తులసి మణి మాట్లాడుతూ పురుగు మందుల ఎంపిక, సరైన మోతాదులో వాడటం, ప్రతి మొక్క పూర్తిగా తడిచేలా పిచికారీ చేయడం ద్వారా అధిక శాతం చీడ పీడల ఉధృతిని నియంత్రించవచ్చన్నారు.

ఏటికొప్పాక, ములకలాపల్లి గ్రామాల్లో..

యలమంచిలి రూరల్: ఖరీఫ్ సాగులో యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయాధికారి పొలిమేర మోహన్‌రావు రైతులకు సూచించారు. మంగళవారం యలమంచిలి మండలం ఏటికొప్పాక, ములకలాపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో పంట పొలాలను పరిశీలించిన వ్యవసాయాధికారులు, సహాయకులు రైతులకు పలు సూచనలు చేశారు. వరి పైరుకు వ్యవసాయాధికారులు సూచించిన మోతాదు మేరకే ఎరువులు, పురుగు మందులు వినియోగించాలని చెప్పారు. రైతు సేవా కేంద్రాల్లో, మన గ్రోమోర్ సెంటర్లలో యూరియా అందుబాటులో ఉందన్నారు. అర్హత ఉండి పీఎం కిసాన్ పథకం కింద ఇంకా లబ్ధి పొందని వారుంటే వెంటనే గ్రామ రైతు సేవా కేంద్రాల్లో, మండల ఏవో కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ పీఎస్ లక్ష్మణ్, అభ్యుదయ రైతులు అప్పలనాయుడు, బాపూజీ, మహిళా రైతులు సుబ్బాయమ్మ, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

కొడవటిపూడిలో..

కోటవురట్ల: మండలంలో కె.వెంకటాపురం, కొడవటిపూడి గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కొడవటిపూడిలో వ్యవసాయాధికారి భీమిరెడ్డి సరోజిని మాట్లాడుతూ వరిలో ఎర్ర తెగులు నివారణకు పొటాష్‌ను వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోసూరు అప్పారావు, ఎంపీటీసీ సభ్యుడు యలమంచిలి ప్రకాష్, సెరికల్చర్ ఆఫీసర్, వెటర్నరీ అసిస్టెంట్, సిబ్బంది పాల్గొన్నారు.

రాంబిల్లి(యలమంచిలి): రాంబిల్లి మండలంలో మర్రిపాలెం, గోకివాడ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంపై అవగాహన కల్పించారు. మండల వ్యవసాయాధికారి సి.సుమంత మాట్లాడుతూ పంటలకు ఎరువుల వాడకం, సస్యరక్షణ చర్యలు తీసుకోవడంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గోకివాడ వైఎస్సార్‌సీపీ నేత నీరుకొండ వెంకట సూర్యనారాయణ, వ్యవసాయాధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: మండంలోని ఎస్.రాయవరం, పి.ధర్మవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి సౌజన్య మాట్లాడుతూ వరికి సోకుతున్న తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతు భరోసా కేంద్రాల వ్యవసాయ సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ జట్లలో నునపర్తి క్రీడాకారులు



ఉమ్మడి విశాఖ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ జట్లకు ఎంపికైన నునపర్తి విద్యార్థులు

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం మండలం నునపర్తికి చెందిన 16 మంది విద్యార్థినీ, విద్యార్థులు ఉమ్మడి విశాఖ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ జట్లకు ఎంపికయ్యారు. మంగళవారం స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఏపీ ఆధ్వర్యంలో చోడవరం మండలం గోవాడ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బాల్ బ్యాడ్మింటన్‌కు సంబంధించి అండర్–14, 17, 19 బాల బాలికల జట్లను ఎంపిక చేశారు. నునపర్తి శ్రీరామ బాల్ బ్యాడ్మింటన్ క్రీడా ప్రాంగణంలో శిక్షణ పొందుతూ జిల్లాలో వేర్వేరు స్కూళ్లు, కళాశాలల్లో చదువుతున్న పలువురు విద్యార్థులు ఈ జట్లలో స్థానం దక్కించుకున్నారు. నునపర్తి గ్రామానికి చెందిన 16 మంది బాల, బాలికలు జిల్లా జట్లకు ఎంపిక కావడంపై క్లబ్ చైర్మన్ ఆర్‌వీవీ నగేష్ హర్షం వ్యక్తం చేశారు. జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులను జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గొంప నరసింహనాయుడు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పెదపూడి శంకరరావు, శ్రీరామ బాల్ బ్యాడ్మింటన్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మాసవరపు అప్పారావు, గారపాటి అప్పలరాజు, తదితరులు అభినందించారు.

ఐక్యతతోనే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం

ఎస్.రాయవరం: ఉపాధ్యాయులంతా ఐక్యంగా ఉంటూ సమస్యలపై పోరాడాలని పీఆర్‌టీయూ మండలాధ్యక్షుడు భద్రరావు అన్నారు. మండలంలోని పలు పాఠశాలల్లో మంగళవారం ఉపాధ్యాయ సంఘ నేతలు పర్యటించి సభ్యత్వం నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు నమోదు పత్రాలను ఉపాధ్యాయలకు అందజేశారు. ఈ మేరకు భద్రరావు మాట్లాడుతూ జీవో నంబర్ 117 రద్దు చేసే విధంగా ఒత్తిడి చేయాలన్నారు.

వ్యవసాయ రంగంలో మహిళల పాత్ర కీలకం



పెదదొడ్డిగల్లులో మహిళా రైతును సన్మానిస్తున్న అధికారులు

నక్కపల్లి: వ్యవసాయ రంగంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని వ్యవసాయాధికారి ఉమాప్రసాద్ అన్నారు. మంగళవారం పెద దొడ్డిగల్లు గ్రామంలో బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మహిళా రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక భాగస్వామ్యం కల్పించడం ద్వారా మహిళా సాధికారత సాధ్యమవుతుందన్నారు. బీసీటీ పశు శాస్త్రవేత్త డాక్టర్ విజయరాణి మాట్లాడుతూ పురుషులతో పాటు సమానంగా సాగులో మెలకువలు తీసుకోవడం పాడి పరిశ్రమలో కూడా మహిళలు ముందంజలో ఉన్నారన్నారు. రాణిస్తున్న మహిళా రైతులు ఒమ్మి మంగ, ఇసరపు నాగలక్ష్మిలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శైలజ, గ్రామ అభ్యుదయ రైతులు, మహిళా రైతులు, సర్పంచ్ గొర్ల విజయలక్ష్మి, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి తులసి మణి, శాస్త్రవేత్త నాగేంద్రప్రసాద్, గ్రామ వ్యవసాయ సహాయకులు లావణ్య, రాజేష్ పాల్గొన్నారు.

వేలం ప్రకటన

మహారాజశ్రీ యలమంచిలి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారికోర్టులో

O.S. 55/2018 E.P. 9/2022

వాది (DHR) : సూరకాసుల వెంకటరమణ

ప్రతివాది (JDR): బొందలపు సత్యనారాయణ

పై నెంబరు దావాలో వాది గారికి ప్రతివాది ఇవ్వవలసిన డిక్రీ బాకీ వగైరాలకు ఈ దిగువ వివరించిన ప్రతివాది తాలూకు స్థిరాస్తి ఇఛ్ఛ సదరు బాకీ వసూలు నిమిత్తం శ్రీ కోర్టు వారు వేలం నిమిత్తం తేది: 25-10-2024కి వాయిదా వేయించిరి. కాబట్టి సదరాస్తి కావలసిన వారు పై తేది ఉదయం 10-30 గంటలకు పై కోర్టు వారి ఎదుట హాజరై వేలంపాట పాడుకొనవలయునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

వేలం కాబడు ఆస్తి వివరం

All that property of the ground floor and 1st floor RCC Roof slab house with site and around compound wall bearing door No. 31-46, Assessment No. 1137006589 (Old Assessment No. 4326), Electrical Service Meter No. 7141 & 7142, covered by Dry Survey No. 60/16 at 16th Ward, 31 Block, Gandhinagaram New State Bank Colony-2, Adjacent to Northern side of Raja Veedhi, Yellamanchili Mandal and Municipality, Anakapalli District bounded by following measurements and boundaries.

The total extent of Vacant site including Ground floor & 1st floor RCC roof slab house extent is 120 Sq. Yards (100.33 Sq.Mts) and its measurements on **East & West** : 18 Feet (5.486 Mts), **North & South** : 60 Feet (18.288 Mts.) and

In that the ground floor RCC Roof slab house extent is 624 Sq. Feet (57.970 Sq. Mts) & its measurements on **East & West**: 13 Feet (3.962 Mts), **North & South** : 48 Feet (14.63 Mts) and

The 1st floor RCC Roof slab house which is existing on RCC ground floor extent is 624 Sq. Feet. (57.970 Sq. Mts) and its measurements on **East & West** : 13 Feet (3.962 Mts), **North & South** : 48 Feet (14.63 Mts) and total bounded by: **East**: Joing Wall belongs to this property and property of Bondalapu Rambabu, **South**: Compound wall of this property beyond that Municipality Road, **West**: Compound wall of this property beyond that house of Khandepalli Surbabu, **North**: House of Koyilada Suguna.

డి.హెచ్.ఆర్. విలువ : రూ. 7,50,000/-

జమీను గారి విలువ : రూ. 30,00,000/-

ప్రస్తుతం రిజిస్ట్రార్ గారి మార్కెట్ విలువ : రూ. 16,69,920/-

దబ్బీరు ఉమాశంకర్
డి.హెచ్.ఆర్. తరఫు అడ్వకేట్
రామాలయం వీధి, యలమంచిలి,
అనకాపల్లి జిల్లా, సెల్ : 9848693828

మకాం : యలమంచిలి
తేది : 16-10-2024